

ఈ యాపారం.. మాకొద్దు..!

ఎక్సైజ్ శాఖలో తారస్థాయికి వర్గపోరు
'పురం'పైనే అధికారుల టార్గెట్
నలిగిపోతున్న మద్యం వ్యాపారులు



హిందూపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు దక్కించుకోవడానికి ఎంతగా ఆరాట పడ్డారో.. ఇప్పుడు ఈ యాపారం మా వల్ల కాదు బాబోయ్ అంటూ చాలా మంది మద్యం వ్యాపారులు లబోదిబోమంటున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా మద్యం షాపులను దక్కించుకోవడానికి ఈసారి నాయకులు తీవ్ర స్థాయిలో పోటీ పడ్డారు. చాలా నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. వైసీపీ హయాంలో ప్రభుత్వమే మద్యాన్ని విక్రయించింది. నాణ్యత లేదంటూ మద్యం ప్రియులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి తాగేవారు. దీంతోపాటు పక్కరాష్ట్రాల మద్యం ఈ ప్రాంతంలో ఏరులై పారింది. కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని మార్చి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది. కమీషన్ పెంచుతామని చెప్పడంతో అధికార, ఇతర పార్టీల నాయకులు సైతం మద్యం షాపుల కోసం పోటీపడ్డారు. ఏడాదికి రూ.65 లక్షలు చెల్లించాలన్నా షాపులను దక్కించుకోవడానికి రూ.2లక్షల డీడీలు తీసి 30 నుంచి 50 వరకు వేశారు. కానీ వ్యాపారం అంతంత మాత్రమే జరుగుతుండటంతో హిందూపురం నియోజకవర్గంలోని మద్యం షాపులపై ఎక్సైజ్ అధికారులు టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారాలు లేక కొంతమంది షాపుల్లో భాగాలు ఉన్నవారు ఈ వ్యాపారం మాకొద్దుబాబోయ్ అంటున్నారని చర్చ జరుగుతోంది.


వర్గపోరే కారణమా..?

హిందూపురం ఎక్సైజ్‌శాఖలో పనిచేసే అధికారిని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్‌శాఖలో ఒకరిద్దరు ఉన్నతాధికారులు టార్గెట్ చేయడంతో వర్గపోరు తారస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా అధికారులు హిందూపురంలోనే టార్గెట్ పెట్టి తమను వేధిస్తున్నారంటూ మద్యం షాపుల యజమానులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఉన్న అధికారిపై ఉన్నతాధికారులు టార్గెట్ చేయడంతో ఆ శాఖ మొత్తం సమన్వయలోపం కారణంగా తామంతా బలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురమే ఎందుకంటే..?

ఉమ్మడి జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. సత్యసాయి జిల్లాలోని ఓ మండలంలో అత్యధికంగా 82 బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఒకే గ్రామంలో మూడు నాలుగు బెల్ట్‌షాపులు ఉన్నాయి. దీంతోపాటు కర్ణాటక మద్యం కూడా ఏరులై పారుతోంది. ఇటీవల నియోజకవర్గంలోని ఓ మండలంలో ఏకంగా 45 బాక్సులు కర్ణాటక మద్యం పట్టుబడడమే ఇందుకు నిదర్శనం. ఇక్కడ కూడా ఒకరిద్దరు కర్ణాటక మద్యం అక్రమంగా దిగుమతి చేసుకుని విక్రయాలు చేస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో తూతూ మంత్రంగా దాడులు చేస్తూ.. హిందూపురం నియోజకవర్గంలోనే ఎక్సైజ్ అధికారులు దాడులు చేయడం అధికార పార్టీలో కలవర పెడుతోంది. ఇక్కడ పనిచేస్తున్న ఎక్సైజ్ అధికారికి ప్రజాప్రతినిధి సహకారం పుష్కలంగా ఉంది. కొన్ని నెలల క్రితం ఎక్సైజ్‌శాఖలో బదిలీల్లో భాగంగా మరో అధికారిని పంపాలని భావించారు. అందుకు ఆయన ససేమిరా అనడంతో ఇక్కడ పనిచేస్తున్న అధికారికి లైన్ క్లియర్ అయింది. అప్పటి నుంచి అధికారిపై ఉమ్మడి జిల్లాలోని ఇద్దరుముగ్గురు అధికారులు వార్ ప్రారంభించారు. ఇక్కడి మద్యం వ్యాపారుల మధ్య సఖ్యతలేక, ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోకుంటున్నారు. ఆ శాఖలోని కొందరు అధికారులకు వ్యాపారులతో ఉన్న సత్సంబంధాల వల్ల హిందూపురంలో మద్యం వ్యాపారంలో చీమ చిటుక్కుమన్నా రాష్ట్రస్థాయి అధికారులకు సమాచారం చేరవేస్తున్నారు. ఈ తరుణంలోనే ఐదు రోజుల క్రితం హిందూపురం నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు చేశారు. ఈ దాడుల్లో నకిలీమద్యం పట్టుబడినట్లు తెలిసింది. దీంతో మద్యం షాపులపై మరింత నిఘా పెంచారు. దీనికారణంగా గత వారం రోజులుగా వ్యాపారాలు పడిపోయాయి. దీంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

లాభాలు వస్తాయని తీసుకుంటే..



హిందూపురం నియోజకవర్గంలో తొమ్మిది మద్యం షాపులు ఉన్నాయి. కొన్నేళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్నవారే అత్యధికంగా ప్రవేశించారు. మంచి లాభాలు వస్తాయని భావించారు. కానీ అందుకు తగ్గట్టుగా మద్యం సరఫరా లేకపోవడం, వ్యాపారాలు కూడా అంతంత మాత్రమే ఉండటంతో పెట్టుబడులకు వడ్డీ కూడా రాకపోవడంతోపాటు చేతి నుంచి విదుల్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని కొంతమంది వ్యాపారులు మదన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మద్యం వ్యాపారంలోకి కొత్తగా ప్రవేశించినవారు తాము పెట్టిన పెట్టుబడి ఇస్తే చాలు.. తమ వాటాలు వదులుకుంటామని చెబుతున్నారు. మరికొందరైతే ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి తాము పెట్టిన పెట్టుబడి ఇప్పించండి ఈ వ్యాపారాలు వద్దంటూ ఒత్తిడి తెస్తున్నారు. హిందూపురం నియోజకవర్గంలో కొంతమంది మద్యం వ్యాపారుల వల్ల అధికశాతం మంది నలిగిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అత్యాశకు పోయి అడ్డంగా దొరికిపోవడంతో ఇక ఈ వ్యాపారంలో లాభాలు రావని దీనికితోడు ప్రతిరోజూ ఎక్సైజ్ అధికారులు హిందూపురం నియోజకవర్గంలోని షాపులపై దాడులు చేయడంతో మున్ముందు ఏం జరుగుతుందోనన్న ఆందోళన చెందుతున్నారు.

భావితరాలకు స్ఫూర్తి వడ్డే ఓబన్న

కలెక్టర్ టీఎస్ చేతన్... ఘనంగా జయంతి వేడుకలు



వడ్డే ఓబన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం వడ్డే ఓబన్న జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంగ్లేయుల బారి నుంచి తమ జాతిని రక్షించుకోవడం కోసం వడ్డే ఓబన్న చేసిన పోరాటం చిరస్మరణీయం అన్నారు. ప్రభుత్వం ఓబన్న జయంతిని అధికారంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారధి, బీసీ సంక్షేమశాఖ అధికారులు, అన్నిశాఖలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తిటౌన్ : ఆంగ్లేయుల పాలన నుంచి భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ప్రసాదించడానికి వడ్డే ఓబన్న చేసిన త్యాగం మరలేనిదని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కొనియాడారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వడ్డే ఓబన్న నాడు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా చేసిన పోరాటం, త్యాగాలు నేటి యువతకు ఆదర్శం అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ వడ్డే ఓబన్న విగ్రహాల ఏర్పాటుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖాధికారి నిర్మలజ్యోతి, వడ్డెర సంఘం నాయకులు చక్రపాణి, గోవర్ధన్, తిరుపేంద్ర, జేవీ రమణ, టీడీపీ నాయకులు గంగాధర్‌నాయుడు, సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్ : వెనుకబడిన వర్గాలు రాజకీయాల్లో రాణించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. వడ్డె ఓబన్న జయంతిని కదిరి పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఉన్న వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షించతగ్గ విషయమన్నారు. చట్టసభల్లో బలహీనవర్గాలు ప్రాతినిధ్యం వహిస్తేనే ఆ వర్గాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వడ్డె ఓబన్న జీవిత చరిత్ర పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి, వడ్డెర సంఘం నాయకులు కుంచెపు గంగరాజు, డాబా గంగయ్య, వల్లెపు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంబరం.. అబ్బురం..



స్పోర్ట్స్ మీటు తిలకిస్తున్న ఆర్‌జే రత్నాకర్, అతిథులు

సాయి విద్యార్థుల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ సందర్భంగా కిక్కిరిసిన హిల్ వ్యూ స్టేడియం

సత్యసాయి శత జయంతి వేడుకలు ప్రారంభం

పుట్టపర్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయి విద్యార్థుల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ అబ్బురపరిచింది. సత్యసాయి చిత్రపటాన్ని కారులో ఊరేగిస్తూ విద్యార్థులు బ్రాస్ బ్యాండ్‌తో శనివారం ఉదయం స్టేడియంకు చేరుకున్నారు. వేదికపైన సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. అనంతరం ప్రశాంతి నిలయం, అనంతపురం, బెంగళూరు బృందావనం, నందిగిరి విద్యార్థులు మంగళ వాయిద్యాలతో సత్యసాయి చిత్రపటానికి వందన సమర్పణ చేశారు. అనంతరం యూనివర్సిటీ జెండాను ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని వెలిగించారు. సత్యసాయి స్పోర్ట్స్ మీట్‌తో బాబా శత జయంతి వేడుకలు ప్రారంభమైనట్లు ట్రస్టు ప్రతినిధులు ప్రకటించారు. విద్యార్థులు మొదట 'దశావతారం.. కలియుగంలో సత్యసాయి అవతారం' పేరిట సంగీత, నృత్య ప్రదర్శన చేశారు. యుగావతార గరుడ వాహనం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థుల రోప్ విన్యాసాలు, కారుపై జంపింగ్, మండుతున్న గోళంలో బైక్ జంపింగ్‌లు అబ్బురపరిచాయి. ఈశ్వరమ్మ పాఠశాల హయ్యర్ సెకండరీ బృందావనం, నందిగిరి విద్యార్థినుల ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈశ్వరమ్మ పాఠశాల విద్యార్థులు సైకిళ్లపై చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. స్పోర్ట్స్ మీట్‌ను తిలకించడానికి వేలాది మంది తరలివచ్చారు. స్పోర్ట్స్ మీట్‌లో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, శ్రీసత్యసాయి గ్లోబల్ ట్రస్టు ఛైర్మన్ చక్రవర్తి, ట్రస్టు సభ్యులు నాగానందం, సత్యసాయి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రాఘవేంద్రప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

కూటమితో అభివృద్ధి వేగవంతం: ఎంపీ



మినీ గోకులాల షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

కొత్తచెరువు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి వేగవంతమయిందని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, కొత్తదేవరపల్లి, ఇండ్లవెంకటాంపల్లి గ్రామాల్లో ఉపాధి నిధుల కింద నిర్మించిన మినీ గోకులాల షెడ్లను శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సత్యసాయి జిల్లాకు 30 మినీ గోకులాలు మంజూరయ్యాయన్నారు. పాడి పరిశ్రమను అభివృద్ధి పరిచేందుకు సబ్సిడీ కింద పాడి రైతులకు దాణాతోపాటు గడ్డిని కూడా అందిస్తోందన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆరునెలల్లోనే అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లు ఉండేవన్నారు. ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో సైతం సీసీ రోడ్లను తమ ప్రభుత్వం వేస్తోందన్నారు. కార్యక్రమంలో పశు వైద్యశాఖ ఏడీ మల్లేష్‌పాటిల్ ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రీడలకు మంచిరోజులు..!

పాఠశాలలకు క్రీడా పరికరాలు
కొనుగోలుకు నిధుల కేటాయింపు
ఇప్పటికే ఆన్‌లైన్‌లో వివరాల నమోదు
గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం



ధర్మవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో క్రీడారంగం పూర్తి నిర్లక్ష్యానికి గురైంది. గత ఐదేళ్ల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల నిర్వహణను పూర్తిగా విస్మరించింది. ఎలాంటి క్రీడా పరికరాలను మంజూరు చేయలేదు. దీంతో విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం, క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు అడుగులు వేస్తోంది. విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వారికి పోషకాహారం, క్రీడాసామగ్రి సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు పాఠశాలల వారీగా వివరాలను కోరుతూ సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. విద్యార్థులకు ఇష్టమైన క్రీడాంశాలను క్రోడీకరించి, దీనికి అనుగుణంగా ఏఏ పరికరాలు అవసరం వంటి వివరాలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీటి కొనుగోలుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది.

ఐదేళ్లూ నిర్లక్ష్యం

సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 80 శాతానికి పైగా ప్రభుత్వ పాఠశాలలకు మైదానాలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్, సర్వశిక్ష అభియాన్ నుంచి నిధులు వెచ్చించి పాఠశాలలకు క్రీడా పరికరాలు సమకూర్చేవారు. వాలీబాల్, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ తదితర క్రీడాకిట్లను అందించేవారు. వాటితో ప్రతి రోజూ సాయంత్రం విద్యార్థులు సాధన చేసే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పాఠశాలల్లో క్రీడల నిర్వహణను గాలికొదిలేసింది. క్రీడా సామగ్రి మంజూరు కాకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. మైదానాల అభివృద్ధిని కూడా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం క్రీడాసామగ్రి పంపిణీకి శ్రీకారం చుట్టింది. అవసరమైన పరికరాల వివరాలను గత నెలలోనే సంబంధిత అధికారులకు పాఠశాలల నుంచి సమర్పించారు. క్రీడా కిట్ల కొనుగోలు కోసం ప్రాథమిక పాఠశాలలకు రూ.5వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.10వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25వేలు, జూనియర్ కళాశాలకు రూ.35వేలు చొప్పున అందించనున్నారు. దీని వల్ల జిల్లాలోని 2097 పాఠశాలల్లో 2.47లక్షల మంది విద్యార్థులు ఆడుకోవడానికి అవకాశం కలుగుతుంది.

ముందుగానే నిధులు



- మొరార్జీయాదవ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు

ప్రస్తుత ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి నిధులను ముందుగానే అందిస్తోంది. గతంలో క్రీడలు నిర్వహించిన తరువాత నిధులు మంజూరయ్యేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. క్రీడల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ స్కూల్ గేమ్స్‌ను నిర్వహిస్తాం. క్రీడాపరికరాల కొనుగోలుకు ఆయా పాఠశాలల పీడీ, పీఈటీలకు ఆదేశాలు ఇచ్చాం. చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులకు ఈ క్రీడాపరికరాలు ఎంతో ఉపయోగపడతాయి.

విద్యార్థులకు ప్రయోజనం



- నాగేంద్ర, పీఈటీ, ధర్మవరం

ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులకు అవసరమయ్యే క్రీడాసామగ్రిని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. గత ఐదేళ్లలో క్రీడా పరికరాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని క్రీడా పరికరాలను అందజేయడానికి సహకరిస్తోంది.

మామిడికి తేనె మంచు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్



మామిడితోటను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

కొత్తచెరువు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల వల్ల మామిడి తోటలకు తేనె మంచు, తామర పురుగుల ఉధృతి పెరగడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆందోళన చెందాల్సిన పనిలేదని, వీటి నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో మామిడితోటలు వారం రోజులుగా పూత దశలోకి మారుతున్న తరుణంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. 10 శాతం కూడా పూత రాని తోటల్లో ఒక తడి ఇచ్చిన అనంతరం 13:0:45, 10 గ్రాములు, సూక్ష్మధాతు మిశ్రమం 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. 25 శాతం పూత దశలోఉన్న తోటల్లో ఒక తడి ఇచ్చిన అనంతరం బ్రాసినోలిడ్ ఒక ఎంఎల్, ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్, హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. 50 శాతం పైబడి పూత వచ్చిన తోటల్లో ప్లానోఫిక్ 0.3 ఎంఎల్, థయోమిథాక్సాన్ 0.3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. 75 శాతం నుంచి 100 శాతం పూత దశలో ఉన్న తోటలు, పిందె దశ 10 శాతం ఉన్న తోటల్లో స్పైనోసార్ 0.3 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అదే విధంగా ఫ్రూట్ ఫ్లై(పండు ఈగ)నివారణ చర్యలు ఇప్పటి నుంచే మామిడితోట రైతులు చేపట్టాలని చెప్పారు. పండు ఈగలను ఆకర్షించే బుట్టలు లేదా మిథైల్ యూజీనాల్ టాబ్లెట్ లేదా జెల్ ను ఒక ఎకరాలో 5 బుట్టలు కట్టిఈగను నియంత్రిస్తే పండుఈగ నష్టాన్ని నివారించుకోవచ్చని తెలిపారు.

ఇప్పుడైనా...

• వైసీపీ పాలనలో ఆగిపోయిన ఆస్పత్రుల నిర్మాణాలు





▲ నిలిచిపోయిన రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణ పనులు

◄ ఆగిపోయిన యాడికి హాస్పిటల్ నిర్మాణ పనులు

సుమారు రూ.3.80కోట్ల వ్యయంతో చేపట్టిన యాడికి, రాయలచెరువు ఆస్పత్రుల నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో యాడికిలో శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే రోగులు చికిత్స పొందాల్సి వస్తోంది. ఎప్పుడు ఏమి కూలుతుందోనని ఆరోగ్య సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాయలచెరువులో రేకులషెడ్డులోనే రోగులకు చికిత్స అందిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తామని హామీలు గుప్పించారు. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో చేస్తున్న పనులను అర్ధంతరంగా ఆపేశారు. కూటమి ప్రభుత్వమైనా సక్రమంగా నిధులు మంజూరు చేసి ఆస్పతుల్ర నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

\- ఆంధ్రజ్యోతి, యాడికి

ఇంకా గుంతలే!

• సంక్రాంతి వస్తున్నా మరమ్మతుకు నోచుకోని రోడ్లు

సంక్రాంతి పండుగ వస్తున్నా మండలంలోని కొన్ని గ్రామీణ రోడ్లు ఇంకా గుంతలమయంగానే కనిపిస్తున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పనులను పట్టించుకోకపోవడంతో మండలంలోని గ్రామీణ రోడ్లు ఛిద్రమయ్యాయి. గుంతల రోడ్లపై ప్రయాణించిన పలువురు ప్రమాదలకు గురయ్యారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమైనా నాటి పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించింది. సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. కానీ మండలంలో రోడ్లు నేటికీ గుంతలతో దర్శనం ఇస్తున్నాయి. మండల కేంద్రంలోని కొండక్యాంప్ కాలనీలో గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హరేసముద్రం గ్రామ పరిధిలో ఫ్యాక్టరీ ఉండటంతో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మండల కేంద్రంతో పాటు కురువళ్లి రోడ్డులో ఉన్న గుంతలు పూడ్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కళ్లదేవనహళ్లి రోడ్డును నిర్మించేందుకు ఉన్న రోడ్డును తవ్వి వదిలేడంతో ద్విచక్రవాహనదారులు కింద పడి గాయపడుతున్నారు. శ్రీధరఘట్ట, దేవగిరి, సిద్దరాంపురం తదితర గ్రామాల రోడ్లు గుంతలతో దర్శనం ఇస్తున్నాయి. గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మేర లక్ష్యాలను చేరుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

\- ఆంధ్రజ్యోతి, బొమ్మనహాళ్



▲ బొమ్మనహాళ్‌లోని బళ్లారి - కళ్యాణ దుర్గం రహదారిపై పడిన గుంతలు..



► తవ్వి వదిలేసిన కళ్లు దేవనహళ్లి రోడ్డు

పతకానికో లెక్క



ఆడినోళ్లకు..ఆడినంత

- గెలిస్తే భారీగా నజరానాలు
- స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ 3శాతానికి పెంపు
- నూతన పాలసీతో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు నజరానాలు, ప్రోత్సాహకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రకటించింది. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పన, శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ క్రీడలకు సంబంధించి మైదానం ఏర్పాటు చేయనున్నారు. ఈక్రమంలోనే క్రీడాభివృద్ధి కోసం నూతన క్రీడాపాలసీని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ద్వారా రాష్ట్రం నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారుల తయారు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ వేదికగా జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీలు నిర్వహణకు కృషి చేయనున్నారు. ప్రజల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచి వారి జీవనశైలిలో మార్పు తేనున్నారు.



అశోక్‌నగర్‌లోని ఇండోర్‌స్టేడియం

\- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్



భారీగా ప్రోత్సాహకాలు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడాపాలసీలో క్రీడారంగానికి, క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరమైన ప్రోత్సాహకాలు అందించనున్నారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధిస్తే రూ.7కోట్లు, రజతం రూ.5కోట్లు, కాంస్యం రూ.3కోట్లు, పోటీల్లో పాల్గొన్నవారికి రూ.15లక్షలు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నారు. ఆసియా క్రీడల్లో బంగారు పతకం సాధిస్తే రూ.4కోట్లు, రజతం రూ.2కోట్లు, కాంస్యం రూ.కోటి, పాల్గొన్న వారికి రూ.10లక్షలు బహుమతిగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాలు సాధిస్తే అత్యధికంగా రూ.50లక్షలు, తక్కువగా రూ.25లక్షలు, పాల్గొన్న వారికి రూ.5లక్షలు అందజేయనున్నారు. భారత ఒలింపిక్ అసోసియేషన్, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, కామన్‌వెల్త్ క్రీడాసమాఖ్య...ఇలా ప్రఖ్యాత క్రీడా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పతకాలు సాధిస్తే ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-1, 2, 3 స్థాయి ఉద్యోగాలు కల్పించనున్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉద్యోగ నియామకాల్లో ఇప్పటి వరకు ఉన్న 2శాతం రిజర్వేషన్‌ను 3 శాతానికి పెంచారు.



చాలా ఆనందంగా ఉంది

రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీలో తీసుకొచ్చిన అంశాలతో చాలా ఆనందం కలుగుతోంది. నాతో పాటు నాతోటి పారా క్రీడాకారులకు ఈ పాలసీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోంది. క్రీడాకారులను ఇలా ప్రోత్సాహిస్తే కచ్చితంగా పతకాలు సాధించడానికి మరింతగా శ్రమిస్తారు. నేను కూడా రాబోయే కాలంలో పతకాల సాధనకు మరింత కృషి చేస్తా.

\- పల్లవి, పారా జాతీయ క్రీడాకారిణి



క్రీడారంగానికి పూర్వ వైభవం

ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త క్రీడాపాలసీతో క్రీడారంగానికి పూర్వ వైభవం రానుంది. ప్రభుత్వం క్రీడాకారులకు ఇచ్చే ప్రతి అవకాశం, ప్రతి పైసాను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థానాలను అధిరోహించాలి. అప్పుడే ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రీడాపాలసీకి సార్థకత లభిస్తుంది.

\- ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ



చాలా ఉపయోగకరం

క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా క్రీడా పాలసీ ఉండటం శుభ పరిణామం. సర్టిఫికెట్లతో పాటు ఆర్థికంగా చేయూతనిచ్చేలా నగదు అందజేయడం క్రీడాకారుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రభుత్వాలు క్రీడాకారులు, క్రీడలను ప్రోత్సహించడం వల్ల గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశానికే మంచి పేరు వస్తుంది. ప్రభుత్వం చెల్లించే ప్రతి పైసా ఉపయోగకరంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. - సంధ్య, శాప్ కోచ్



అద్భుతమైన అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడా పాలసీ ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అద్భుతమైన అవకాశం. ఇప్పటి వరకు ఇంతటి భారీ ప్రోత్సాహకాలు ఎన్నడూ రాలేదు. ఒలింపిక్స్ ఆసియా క్రీడలతో పాటు జాతీయ, ఇతర అంతర్జాతీయ క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ఈ ప్రోత్సాహకం ఒక వరం.

\- వెంకటేశులు, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ



అథ్లెట్లకు బంగారు భవిష్యత్తు

నగదు ప్రోత్సాహకంతో అథ్లెట్ల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్లే అనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడా పాలసీలో నగదు ప్రోత్సాహకం ఆర్థికంగా, మానసికంగా ఎంతగానో చేయూత ఇచ్చేలా ఉంది. పేద క్రీడాకారులు నిరంతర సాధన, పౌష్టికాహారం, క్రీడా సామగ్రి, యూనిఫాం, రవాణకు ఎంతగానో వెచ్చిస్తున్నారు. ప్రభుత్వం విజేతలకు అందజేసే ఆర్థిక చేయూతతో క్రీడాకారులపై ఆర్థిక భారం తగ్గి మరింత మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

\- సురేష్, అథ్లెటిక్ కోచ్



కొండంత ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడా పాలసీ క్రీడాకారులకు కొండంత ప్రోత్సాహకం ఇస్తుంది. ఆసక్తి ఉన్న క్రీడల్లో ఆయా క్రీడాకారులు రాణించేందుకు ఇదొక మంచి అవకాశంగా భావిస్తున్నాం. క్రీడాపాలసీలో క్రీడా మైదానాలు, వసతుల కల్పన అత్యంత ప్రాధాన్యతమైంది. క్రీడా మైదానాలు, వసతులు లేక చాలా మంది పేద క్రీడాకారులు క్రీడలకు దూరమవుతు న్న పరిస్థితులు చూస్తున్నాం. ఇక ఆపరిస్థితులు ఉండవని అనుకుంటున్నాం.

\- నరేష్, డీఎస్ఏ షటిల్ బ్యాడ్మింటన్ కోచ్



ప్రభుత్వానికి ధన్యవాదాలు

నూతన క్రీడాపాలసీలో పారా క్రీడాకారులకు ప్రత్యేక స్థానం కల్పించి నందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర విద, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, రామస్వామి, శాప్ ఎండీ-వైస్ చైర్మన్ గిరీషాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా పారా క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహకాలు ప్రకటించడం శుభపరిణామం.

\- నాగరాజు, జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



స్వాగతిస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వస్తున్న స్పోర్ట్స్ పాలసీని వ్యాయామ ఉపాధ్యాయులందరూ స్వాగతిస్తున్నాం. క్రీడా పాలసీ శుభ సూచికం. స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ 2శాతం నుంచి 3శాతానికి పెంచడం క్రీడాకారులకు అద్భుతమైన అవకాశం. రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి అవకాశాన్ని క్రీడాకారులు అందిపుచ్చుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వానికి పీఈటీలు, క్రీడాకారుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

\- మొరార్జీ యాదవ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, పీఈటీ

న్యూస్ బాక్స్

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో జిల్లా విద్యార్థి



పవన్‌ను అభినందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు జిల్లాకు చెందిన డిగ్రీ విద్యార్థి పవన్ ఎంపికయ్యాడు. నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో పవన్ పాల్గొంటున్నాడు. నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న పవన్ ఎన్‌వైకే ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యూత్‌ఫెస్టివల్‌లో జనరల్ నాలెడ్జ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌లో కూడా ప్రథమ స్థానంలో నిలిచి నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు. తొలి రోజు శనివారం ఢిల్లీలో ప్రారంభమైన యూత్ ఫెస్టివల్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పవన్‌ను అభినందించారు. ఆదివారం రెండో రోజు ఫైనల్ రౌండ్ జరగనుంది.

మహాసభలను విజయవంతం చేయండి

అనంతపురం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ అసోసియేషన్ ప్రాంతీయ కార్యదర్శి నాగయ్య శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయ కల్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ రీజియన్ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలపై చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రీజియన్‌లోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులందరూ విరివిగా హాజరుకావాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సంక్షేమమే
ఎమ్మెల్యే ధ్యేయం

- టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ
- మున్సిపల్ కార్మికులకు సంక్రాంతి కానుక పంపిణీ



కార్మికురాలికి సంక్రాంతి కానుకను అందజేస్తున్న దేవినేని ధర్మతేజ తదితరులు

కళ్యాణదుర్గం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ అన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శనివారం ఆయన వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్ టీడీపీ కౌన్సిలర్లతో కలిసి సుమారు 64 మంది మున్సిపల్ కార్మికులకు సంక్రాంతి కానుక పేరుతో దుస్తులు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల బాగోగులు పూర్తిగా విస్మరించిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక మున్సిపల్ కార్మికుల ఆశయాలను నెరవేర్చుతోందన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని కార్మికులకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సొంత నిధులతో సంక్రాంతి కానుకలు అందజేశారని చెప్పారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే అమిలినేని ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నెట్టికంటి సన్నిధిలో వెంకటరమణ మూర్తి దంపతులు

నెట్టికంటి సేవలో విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్

గుంతకల్లు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అడిషనల్ డైరెక్టరు వెంకటరమణ మూర్తి కుటుంబ సమేతంగా శనివారం ఉదయం కసాపురం దేవస్థానంలో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వెంకటరమణ మూర్తి, ఆయన కుటుంబ సభ్యులను దేవస్థాన అధికారులు, అర్చకులు సాదరంగా ఆహ్వానించారు. స్వామివారి సన్నిధిలో పూజలు చేయించారు. స్వామివారి ఉత్తరీయాన్ని వేసి ఆశీర్వచనం పలికి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వాణి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో భారీగా సోలార్ ప్లాంట్లు

7500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం..

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

అనంతపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 7500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎన్టీపీసీ దక్షిణభారత కోఆర్డినేటర్ శంకర్ రాజు, ఏపీ ట్రాన్స్‌కో మాజీ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్‌బాబులతో శనివారం సమావేశమయ్యారు. ప్లాంట్ల ఏర్పాటుపై సమీక్షించారు. కాలవ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో వెనుకబడిన రాయదుర్గం ప్రాంతంలో యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు అవకాశం లభిస్తుందన్నారు. రాయదుర్గం పరిధిలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 1500 మెగావాట్ల ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఆ మేరకు స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో శ్రమిస్తూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నా రన్నారు. చంద్రబాబుపై విశ్వాసం, ప్రభుత్వ ప్రోత్సాహంతో వివిధ సంస్థలు, నిర్వాహకులు పరిశ్రమల స్థాపనకు రాష్ట్రానికి వస్తుండటం శుభపరిణామమన్నారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం ప్రాంతాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లడానికి తీవ్రంగా శ్రమిస్తున్నానన్నారు. ఎన్టీపీసీ ద్వారా సుమారు 1500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో డి.హీరేహాళ్ మండల పరిధిలో ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ పవర్ గ్రిడ్, సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం సంస్థ ప్రతినిధులు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. అవసరమైన భూమిని వివిధ ప్రాంతాల్లో పరిశీలిస్తున్నామన్నారు. ఎన్టీపీసీతో పాటు మరికొన్ని సంస్థలు కలిపి మరో 6000 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డి. హీరేహాళ్ టీడీపీ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీపీసీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

అప్పుడో.. ఇప్పుడో..!

కూలేందుకు సిద్ధంగా ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులు

పిల్లర్లు దెబ్బతిని బయటకు కనిపిస్తున్న ఇనుప కడ్డీలు

భయాందోళనలో ఆయా గ్రామాల ప్రజలు



• ఈ చిత్రంలో కనిపిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు మండలంలోని కృష్ణంరెడ్డిపల్లి బీసీ కాలనీలోనిది. వాటర్ ట్యాంకు పూర్తిగా దెబ్బతింది. ఎప్పుడు కూలుతుందో అన్నట్లుగా పరిస్థితి ఉంది. ట్యాంకు పిల్లర్ల పెచ్చులూడిపోయి కంకర, కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. పెద్ద గాలి వీస్తే ట్యాంకు ఊగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. జరగరానిది ఏదైనా జరిగితే స్థానికుల ప్రాణాలు పోయేపరిస్థితి ఉంది. మూడు దశాబ్దాల కిందట ఈ ట్యాంకు నిర్మాణం జరిగినట్లు సమాచారం.



అనంతపురం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో దశాబ్దాల కిందట నిర్మించిన ఓవర్ హెడ్ నీటి ట్యాంకులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతాయో అన్నట్లుగా పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకులు దెబ్బతిన్న విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలు గ్రామాల్లో దెబ్బతిన్న ట్యాంకులు

రూరల్ మండలంలోని ఉప్పరపల్లి, ఆకుతోటపల్లి, చియ్యేడు, తాటిచెర్ల, మన్నీల, కృష్ణంరెడ్డిపల్లి, పూలకుంట, కక్కలపల్లి కాలనీ, అక్కంపల్లి పరిధిలోని ఎస్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఓవర్ హెడ్ నీటి ట్యాంకులున్నాయి. వీటిలో తాటిచెర్ల, కృష్ణంరెడ్డిపల్లి, కక్కలపల్లి కాలనీ పరిధిలోని ట్యాంకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పూలకుంట ఎస్సీ కాలనీలోని ట్యాంకు పరిస్థితి అప్పుడో.. ఇప్పుడో అన్నట్లుగా ఉంది. పూర్తిగా దెబ్బతినడంతో ట్యాంకుకు నీటి సరఫరా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఉప్పరపల్లిలోని ట్యాంకు మెట్లు దెబ్బతిడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఇనుప మెట్లు ఏర్పాటు చేయించారు. కాగా నరసనాయునికుంట గ్రామంలోని ట్యాంకు ఇటీవల కూలిపోయింది. ఈక్రమంలోనే దెబ్బతిన్న ట్యాంకులను తొలగించి, వాటి స్థానంలో నూతన ట్యాంకులను నిర్మించాలని కోరుతున్నారు.



పూలకుంట ఎస్సీకాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు

ట్యాంకు నిర్మాణాలకు ప్రతిపాదనలు..

మండలంలో దెబ్బతిన్న ఓవర్‌హెడ్ ట్యాంకుల పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. శిథిలమైన వాటిని తొలగించి, వాటి స్థానంలో కొత్తని నిర్మించేందుకు ప్రతిపాదనలు కూడా పంపాం. అనుమతులు రాగానే పాతవాటిని తొలగించి కొత్తవాటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- హరికుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

• ఇక్కడ కనిపిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు మండలంలోని తాటిచెర్లలోనిది. ఈ ట్యాంకును నాలుగు దశాబ్దాల కిందట నిర్మించినట్లు సమాచారం. ట్యాంకు పూర్తిగా దెబ్బతిని, శిథిలావస్థకు చేరకుంది. సిమెంట్ ఊడి పోవడంతో ఇనుప కండీలు కనిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడు కూలుతుందో చెప్పలేని పరిస్థితి. స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.





అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత




ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ








ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత




కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

ఇంటి నుంచి పారిపోయిన

నలుగురు పిల్లలు

ఫిర్యాదు అందిన రెండు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

డి.హీరేహాళ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఇంటి నుండి పారిపోయిన నలుగురు పిల్లలను గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకుని కుటుంబసభ్యులకు అప్పగించిన సంఘటన శనివారం జరిగింది. మండలంలోని జాజరకల్లు గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన చుట్టుపక్కల ఉన్న నలుగురు పిల్లలు ఇంట్లో కుటుంబసభ్యులు మందలించా రన్న కారణంతో శుక్రవారం అర్ధరాత్రి ఇంటి నుంచి పారిపోయారు. ఉదయం గమనించిన కుటుంబసభ్యులు చుట్టు పక్కల గాలించినా ఉపయోగం లేకపోవడంతో 11.30 గంటల సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో రెండు బృందాలుగా ఏర్పడి గాలింపుచర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆ పిల్లలు ఉన్న ప్రదేశాన్ని కనుగొన్నారు. ఆ పిల్లలు కర్ణాటక విజయనగరం జిల్లా హలిగి ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ఆ పిల్లలు ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. తన ఆ పిల్లలను తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పిల్లల కుటుంబసభ్యులను పిలిపించి, అప్పగించారు. ర్యాదు అందిన రెండు గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ జగదీష్ అభినందించారు.

సరదా కోసం జీవహింసా..?



ఐదు బండ్లలో 80 బస్తాలు లాగుతున్న ఒంటెద్దు

కొందరు యువరైతులు సరదా కోసం పందేలు వేసి ఎద్దుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల మండలంలోని దేవగిరిలో కొందరు ఐదు బండ్లలో 70 ధాన్యం బస్తాలు వేసి ఒంటిఎద్దుతో ఒక కిలోమీటర్ లాగించారు. మరి మేమేం తక్కువ అనుకున్నారో ఏమో గోవిందవాడ గ్రామంలో కొందరు యువరైతులు శనివారం ఐదు బండ్లలో 80 ధాన్యం బస్తాలు వేసి ఒంటి ఎద్దుతో మూడు కిలోమీటర్లు లాగించారు. మూగజీవాలు కదా అదిలిస్తే పోతాయని అనుకుంటున్నారో ఏమో ఎంతంటే అంత బరువు వాటిపై వేసి లాగిస్తున్నారు. వాటికి కూడా ప్రాణం ఉంటుందని, పరిమితికి మించిన బరువు మోయలేవని మరచి జీవహింసకు పాల్పడుతున్నారు. అన్నదాతలారా..! ఒకసారి ఆలోచించండి అవి ఎద్దులు కాదు మీ జీవన నేస్తాలు.

- బొమ్మనహాళ్, ఆంధ్రజ్యోతి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



కిరణ్మయి

ధర్మవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఈ నెల 14 నుంచి 19వతేదీ వరకు చెన్నైలో జరిగే అండర్-17 బాలికల ఎస్‌జీఎఫ్ నేషనల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర బాలికల జట్టుకు ధర్మవరానికి చెందిన కిరణ్మయి ఎంపికైందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఈ విద్యార్థిని కిరణ్మయిను శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు.

రైతును మింగిన అప్పులు

పొలంలోనే అన్నదాత ఆత్మహత్య



నాగేశ్(ఫైల్)

తాడిమర్రి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బోరు, పైపలైన్ వేయడానికి చేసిన అప్పులు ఓ రైతును మింగేశాయి. తనకున్న 5.30 ఎకరాల్లో పంటలు సాగు చేసుకునేందుకు సీబీఆర్ ఏటీలో బోరు వేసి పైపులైన్ వేయడానికి అయిన ఖర్చులు ఆ రైతుకు భారమయ్యాయి. తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి చెందిన వాల్మీకి పుల్లన్న కుమారుడు నాగేశ్(42) శనివారం తన పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దాదాపు రూ.20 లక్షల దాకా అప్పులు చేసి తన పొలానికి రెండు కిలో మీటర్ల దూరంలోని సీబీఆర్ కాలువలో బోరు వేసి నీరుపడడంతో పైపులైన్ వేశాడు. మూడేళ్ల క్రితం అరటి పంటసాగు చేశాడు. అప్పటి నుంచి ఇప్పటి పంట సాగుకోసం అవుతున్న ఖర్చులు మాత్రమే దిగుబడిగా వచ్చిందేకానీ లాభాలు రాలేదు. దీంతో అప్పులకు వడ్డీలు పెరిగి రెండింతలు కావడంతో ఎలా తీర్చుకోవాలో దిక్కుతెలియని పరిస్థితిలో తన పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమీప బంధువు శివయ్య గమనించి బంధువులకు సమాచారం అందించాడు. రైతును బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. నాగేశ్‌కు భార్య లక్ష్మీదేవి ఉన్నారు. వీరికి సంతానంలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ క్రిష్ణవేణి తెలిపారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

- అరటితోటను నరికేసిన కేసు దర్యాప్తు
- రెండోరోజు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

పుట్లూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగారికుంట గ్రామంలో అరటితోటను నరికిన కేసులో అనుమానితులను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు అరటితోటను ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విషయంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబులు శనివారం మరోసారి పోలీసు జాగిలం పిలిపించి తనిఖీ చేయించారు. కొండుగారికుంట నుంచి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించగా పక్కనే ఉన్న కుమ్మనమల గ్రామంలోని మూడు ఇళ్ల వద్ద జాగిలం ఆగినట్లు సమాచారం. అనుమానంతో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అరటితోట నరికివేసిన కేసులో నిందితులను డాగ్‌స్క్వాడ్ ఆధారంగా పట్టుకున్నట్లు సమాచారం. జాగిలం కుమ్మనమల గ్రామంలో కొందరు ఇళ్ల వద్దకు వెళ్లి కూర్చొంది. నరికివేతకు ఉపయోగించిన కొడవలి వద్ద కూడా జాగిలం ఐదునిమిషాల పాటు కూర్చునట్లు సమాచారం. నిందితులను అనంతపురం తరలించినట్లు తెలుస్తోంది. అక్కడ పోలీసులు తమదైనశైలిలో కౌన్సెలింగ్ ఇవ్వగా నిందితులు అరటిచెట్లను నరికివేసినట్లు ఒప్పుకున్నట్లు సమాచారం.

చీనీ టన్ను రూ. 17వేలు

అనంతపురం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మా ర్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిం దు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6వేలు, సరాసరి రూ. 11వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం ఎనిమిది టన్నుల చీనీకాయలు వచ్చాయని అన్నారు.

టమోటా కిలో రూ. 16

అనంతపురం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 8 పలికినట్లు ఆయన తెలిపారు.

709 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 709 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 కు 442 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే గోకులాలు

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

తనకల్లు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే కూటమి ప్రభుత్వం గోకులాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని గోళ్లవారిపల్లి, కోటూరు గ్రామాల్లో మహిళా రైతుల కోసం నిర్మించిన గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి గోకులం షెడ్లు ఉపయోగపడతాయన్నారు. మండలానికి 55 షెడ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోనే ఎక్కువగా తనకల్లు మండలానికి మంజూరైనట్లు తెలిపారు. వైసీపీ పాలనలో రైతులు, రైతులు, మహిళా సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఎంపీడీఓ రెడ్డెప్ప, ఏపీఓ మరియమ్మ, ఏపీడీ రమేష్‌బాబు, డాక్టర్ హరినాథ్‌రెడ్డి, వివిధ శాఖలాధికారులు, టీడీపీ కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రవీంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

నల్లచెరువు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుంట్లపల్లివాండ్లపల్లిలో నిర్మించిన గోకులం షెడ్‌ను ఎమ్మెల్యే కందికంట వెంకటప్రసాద్ శనివారం ప్రారంభించారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలకేంద్రంలోని వడ్డె ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం దేవరింటిపల్లిలో పలు కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, ఏపీడీ రమేష్‌బాబు, టీడీపీ కన్వీనర్ రాజశేఖర్, అంజనప్ప, నాగభూషణనాయుడు, దాద్దెం శివారెడ్డి, రామచంద్ర, ఆనంద్, బషీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండలంలో నిర్మించిన గోకులం షెడ్లను శనివారం ఎంపీడీఓ ఆంజనప్ప ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతనంగా నిర్మించిన షెడ్లను ప్రారంభించామన్నారు. టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, నరసింహులు, సర్పంచ్ అంజనమ్మ, సిద్దయ్య, మౌలా, చాంద్‌బాషా, బీజేపీ మండలాధ్యక్షుడు బాబ్‌జాన్, రామమోహన్, ఏపీఓ చంద్రశేఖర్, ఎఫ్ఏ లక్ష్మయ్య పాల్గొన్నారు.

గాండ్లపెంట: ఉపాధి పథకంలో నిర్మించిన గోకులాల షెడ్లను మండల అధికారులు, కూటమి నాయకులు శనివారం ప్రారంభించారు. కటారుపల్లి క్రాస్, గాండ్లపెంట, నల్లగుట్టతండాలో నిర్మించిన గోకులం షెడ్లును వారు ప్రారంభించారు. ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, పశువైద్యాధికారి చెన్నకేశవుల నాయక్ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న ఆశయాలు కొనసాగిద్దాం

వడ్డె ఓబన్న ఆశయాలను కొనసాగిద్దామని పలువురు వక్తలు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో వడ్డెర సంఘం నాయకులు ఓబన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కూటమి ప్రభుత్వం అధికారికంగా ఓబన్న జయంతిని నిర్వహించడం అభినందనీయమని నాయకులు అన్నారు.

- ఆంధ్రజ్యతి న్యూస్ నెట్‌వర్క్


కొత్తచెరువులో కేక్‌కట్ చేస్తున్న ఎంపీ బీకే, ఎమ్మెల్యే సింధూరారెడ్డి, పల్లె


ధర్మవరంలో వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు మురళి, రంగప్ప తదితరులు


ఓడీసీలో సుధాకర్, అంజనప్ప, శ్రీనివాసులు తదితరులు


నంబులపూలకుంటలో ఈఓఆర్డీ మాధవరెడ్డి, రమేష్ శరత్


నల్లమాడలో తహసీల్దార్ రంగనాయకులు, విశ్వనాథరెడ్డి, శివశంకర్


తనకల్లులో గంగరాజు, కిష్టప్ప, శ్రీనివాసులు, జయరాజ్ తదితరులు


గాండ్లపెంటలో టీడీపీ నాయకులు వెంకటరమణారెడ్డి, గంగరాజు, శ్రీనివాసులు


బత్తలపల్లిలో ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ స్వర్ణలత, కిష్టప్ప

న్యూస్ బాక్స్

వైభవంగా చెన్నకేశవుడి గరుడోత్సవం


గరుడవాహనంపై స్వామివారు

ధర్మవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి గరుడోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగిసినట్లు ఆలయన ఈఓ వెంకటేశులు, అడహక్ చైర్మన్ జగదీశ్వరప్రసాద్ తెలిపారు. స్వామివారి మూలవిరాట్‌ను అర్చకులు మకరందబాబు, కోనేరాచార్యులు, భానుప్రకాశ్ ప్రత్యేకంగా అలంకరించి గరుడ పల్లకీలో స్వామివారిని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. అన్నమయ్య సేవామండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

ముగిసిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు

ధర్మవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు, ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం ముగిశాయి. ముందుగా స్వామివారిని పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు రాజేశ్ పూజలు చేశారు. అనంతరం శాంతిహోమం, పూర్ణాహుతి, బలిహరణ, కలశ ఉద్వాసన తదితర పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, జింకా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

పుట్టపర్తిటౌన్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కళాశాల డీన్ బాలకోటేశ్వర్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు జానపదనృత్యాలు, సంగీతం, సంక్రాంతి ప్రాముఖ్యతను తెలుపుతూ ప్రదర్శనలు చేశారు. కోలాటం, భోగి మంటలు వేసి, సంప్రదాయ నృత్యాలు, డప్పులతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో...


సంక్రాంతి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

గాండ్లపెంట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. సంక్రాంతి రంగుల ముగ్గులు వేసి, గొబ్బెలు పెట్టి, పాల పొంగులతో సంప్రదాయంగా వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మీదేవి, కమలమ్మ, శోభ, కళావతి, వాసవి, సుకన్య పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నల్లమాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని టీడీపీ నాయకుడు టెంటు కేశవరెడ్డి, సూర్యనారాయణరెడ్డిల తల్లి బయమ్మ అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

117 జీవో రద్దుపై ఎస్టీయూ హర్షం

కొత్తచెరువు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకొని 117 జీవోను ప్రభుత్వం రద్దుచేయడంపై ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జీవో రద్దుతో ప్రభుత్వ పాఠశాలలకు తిరిగి పూర్వవైభవం వస్తుందన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. దీనికి తోడు ఉపాధ్యాయ పోస్టులు కూడా పెరుగుతాయన్నారు. జీవో రద్దు చేసిన విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

కదిరి అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ రచించిన విద్వేష రాజకీయాలు-అసమానతల ఆర్థిక విధానాలు అనే పుస్తకాన్ని శనివారం కదిరిలో ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా వామపక్ష పార్టీలో పనిచేస్తున్న రాంభూపాల్ భావితరాలకు ఉపయోగపడే విలువైన సమాచారంతో పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. ఉమ్మడి అనంతపురం రైతులు ఎదుర్కొంటున్న బాధలను, సరళీకరణ పేరుతో వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్న పాలకుల విధానాలను స్పష్టంగా వివరించారు. రిటైర్డు ఉపాధ్యాయులు మహమ్మద్‌షఫీ, సీపీఎం నాయకుడు నరసింహులు, జగన్మోహన్, బాబ్‌జాన్, ముస్తాక్ పాల్గొన్నారు.

రామమోహన్‌కు సన్మానం


రామమోహన్‌ను సన్మానించిన కేంద్ర మంత్రి

ఓబుళదేవరచెరువు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీ తరపున ఫోక్ డ్యాన్స్‌లో ప్రతిభ కనబరచిన ఓడీసీ మండలవాసి రామమోహన్‌ను శనివారం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామోహన్‌నాయుడు దుశ్శాలువతో సన్మానించారు. శనివారం ఢిల్లీలోని భారత్ మండప భవనంలో 26 దేశాలనుంచి కళాకారులు పాల్గొన్నారు. ఏపీ తరపున ఫోక్ డ్యాన్స్‌లో రామమోహన్ ప్రతిభ కనబరచడంతో అతనికి కేంద్ర మంత్రి షీల్డు అందించి సన్మానించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమం


లలిత నాట్యకళానికేతన్ శిష్యబృందంతో గురువులు

ధర్మవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం రాత్రి లలిత నాట్య కళానికేతన్ విద్యార్థినులు చేసిన అన్నమయ్య త్యాగరాజ కీర్తనల నాట్యం పలువురిని అలరించాయి. గురువులు బాబూబాలాజీ, కమలా బాలాజీ శిష్యబృందం కొత్తపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో నాట్యప్రదర్శన చేశారు. అన్నమయ్య త్యాగరాజ కీర్తనల నాట్యం, వినాయకస్తుతి, శివతాండవం, కోలాటం, కుంభజ్యోతి నాట్యం ప్రదర్శించారు.

అక్రమ లేఅవుట్‌లో రాళ్ల తొలగింపు

గాండ్లపెంట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామంలో అక్రమంగా వేసిన లేఅవుట్‌లో రాళ్లను పంచాయతీ అధికారులు శనివారం తొలగించినట్లు కార్యదర్శి భవాని తెలిపారు. గతనెల 16న అసైన్డ్ భూముల్లో రియల్ దందా అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు అక్రమ లేఅవుట్‌లో నాటిన రాళ్లను తొలగించారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

ధర్మవరం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని సీతారంపల్లి 44వ జాతీయరహదారి క్రాస్ వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న కార్మికుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు, రూరల్ పోలీసులు తెలిపిన మేరకు సీతారంపల్లి గ్రామానికి చెందిన మారుతి(42) మామిళ్లపల్లికి తన సొంత ద్విచక్రవాహనంలో వెళ్లాడు. తిరిగి రాత్రి స్వగ్రామానికి వస్తుండగా సీతారంపల్లి వైజంక్షన్ వద్ద తిరుగుతుండగా బెంగుళూరు నుంచి అనంతపురం వైపు వెళ్లే కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మారుతి తీవ్రంగా గాయపడి స్పృహకోల్పోయాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు మామిళ్లపల్లి వద్ద అద్దాల ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేసుకుని జీవనం సాగించేవాడన్నారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్సపొందుతూ యువకుడు..

బత్తలపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాగేషు (25) అనే యువకుడు చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు బత్తలపల్లికి చెందిన వెంకటరాముడు మనెమ్మ దంపతుల కుమారుడు నాగేషు 8వ తేదీన రాత్రి విషద్రావకం తాగి అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ఇసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పోందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నాగేషు ఏసీ మెకానిక్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇతనికి ఇంకా పెళ్లి కాలేదు.

భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీశుడి ఆలయం


స్వామిదర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

కదిరి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వైకుంఠ ద్వాదశితో పాటు ధనుర్మాసం కావడంతో భక్తులు స్వామి దర్శనానికి ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి కావడంతో దర్శించుకోలేని భక్తులందరూ శనివారం బారులు తీరారు.

నిజాయతీని చాటుకున్న కండక్టర్


ప్రయాణికుడికి పర్సు అందచేస్తున్న కండక్టర్ లక్ష్మీనరసమ్మ

కదిరి అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కదిరి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న లక్ష్మీనరసమ్మ తన నిజాయితీని చాటుకున్నారు. శనివారం కదిరి నుంచి హిందూపురం వెళ్లే బస్సులో ప్రయాణికుడు ప్రసాద్ తన పర్సును బస్సులో జారవిడుచుకుని రామపల్లివద్ద దిగిపోయాడు. కొద్దిసేపు తరువాత పర్సును గమనించిన కండక్టర్ అందులో ఉన్నఫోన్ నంబర్ ఆధారంగా ఆ ప్రయాణికుడికి ఫోన్‌చేసి, తిరుగు ప్రయాణంలో పర్సును అతనికి అందజేశారు. కండక్టర్ నిజాయితీని డిపో మేనేజర్ ఐనోద్దీన్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ పెద్దన్న, తోటి ఉద్యోగులు అభినందించారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా సోంపాళ్యం



తనకల్లు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా టీడీపీ నాయకుడు సోంపాళ్యం నాగబూషణంను నియమించినట్లు తెలిపారు. శనివారం ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే కందికుంట ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధిలో కమిటీ సభ్యులుగా ఎన్నికైనవారు కీలకపాత్ర పోషించాలన్నారు. సమస్యలను గుర్తించి, ఎప్పటికప్పుడు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందేలా డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

సంక్రాంతికి వస్తానంటివే..

● ఇంటికి రాకుండానే వెళ్లిపోతివా...
● గోడ కూలి హిటాచీపై పడి డ్రైవర్ మృతి
● కన్నీరుమున్నీరైన భార్య

మదనపల్లె అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రేపు ఇంటికి వస్తాను... అందరం కలిసి భోజనం చేద్దాం. సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుందాం అని చెప్పి కానరాని లోకానికి వెళ్లిపోతివా... అంటూ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మృతుడి భార్య తన చిన్న పిల్లలతో కలిసి రోదించడం చూసి అందరూ కంటతడిపెట్టారు. మండలంలోని సీటీఎం మిల్లు ప్రదేశంలో పాత గోడలను కూలుస్తూ శనివారం ఉదయం గోడకూలి హిటాచీపై పడటంతో రమేశ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. తాలుకా సీఐ కళా వెంకరటమరణ కథనం మేరకు మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీలోని సీటీఎం మిల్లు ప్రదేశంలో నెల రోజులుగా హిటాచీలతో గోడలను తొలగించే పనులు చేస్తున్నారు. కడప జిల్లా వల్లూరు మండలం కుమారునిపల్లెకు చెందిన నారాయణరెడ్డి కుమారుడు ఎస్.రమేష్‌రెడ్డి (40) సత్యసాయి జిల్లా కదిరిలో భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను హిటాచీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మదనపల్లెకు ఈనెల 2వ తేదీ వచ్చాడు. హిటాచీతో గోడను తొలగిస్తూ ప్రమాదవశాత్తు గోడ కూలి హిటాచీపై పడటంతో అందులోనే ఇరుక్కుపోయి మృతి చెందాడు. అక్కడే ఉన్న మరో డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. మృతుడికి 13, 11 ఏళ్ల వయసు కలిగిన కుమార్తెలు, నాలుగేళ్లున్న కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ప్రవీణ ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ కళావెంకటరమణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శవపరీక్షల అనంతరం మృతదేహాన్ని కదిరి తరలించినట్లు మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు.


రమేష్‌రెడ్డి (ఫైల్)



హిటాచీలో చిక్కుకున్న మృతదేహం, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుడి భార్య, పిల్లలు

రోగులకు మెరుగైన సేవలందించండి

● డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం

కదిరి అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలందించాలని డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం సూచించారు. శనివారం మండలంలోని పట్నం ప్రభుత్వం ఆసుపత్రి, కుటాగుళ్ల ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీసి, పలు రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఆమెతోపాటు డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్, డాక్టర్లు వినోద్‌కుమార్, ఉషారాణి, వైద్య సిబ్బంది ఉన్నారు.

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఫైరోజ్ బేగం శనివారం తనిఖీ చేశారు. ఆరోగ్యసేవలపై ఆమె ఆరాతీశారు. అనంతరం రికార్డులు, ల్యాబ్, వాక్సినేషన్ గదులు, వార్డులు, ఆరోగ్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఎర్రవంకపల్లి గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ వైద్యం చికిత్సలను పరిశీలించారు. వైద్యులు గణేనాయక్, సీహెచ్ఓ రామాంజులు, ఎంపీహెచ్ఎస్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండలంలోని మలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండహెచ్ఓ ఫైరోజ్‌బేగం శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులను, వ్యాక్సిన్, లేబర్ రూంలు, రోగుల గదులు, ఓపీలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల వివరాలు అడిగితెలుసుకున్నారు. వైద్యాధికారులు నాగేంద్రనాయక్, రోజా, ఎంపీహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


పట్నం ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఫైరోజ్‌బేగం

ఘనంగా క్రీడోత్సవాలు

ధర్మవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సత్యసాయిజిల్లా ధర్మవరంశాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా క్రీడోత్సవాలను నిర్వహించారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వాసుదేవ మాట్లాడుతూ స్వామివివేకానంద యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు శ్రీనివాసులు, గిరి, హరి, రాజేశ్ పాల్గొన్నారు.

రేపు ఆటల పోటీలు

ధర్మవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు బీజేపీ కార్యాలయ సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు 13, 14వ తేదీలలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఉంటాయన్నారు. గాలిపటాలు, గోలీలు, బొంగరాలు, గంగిరెద్దులు, హరిదాసు, ముగ్గుల పోటీలు, పిండివంటలు తదితర పోటీలను నిర్వహిస్తామన్నారు. పోటీల్లో గెలుపొందినవారికి ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ రూ.15వేలు, తృతీయ రూ.10వేలు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందిస్తామన్నారు.

18 నుంచి సహకార సంఘం ఎన్నికలు

ధర్మవరంరూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వసంతపురం, నడిమిగడ్డపల్లి, పోతుకుంట, గొట్లూరు గ్రామాలకు సంబంధించి ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలను 18నుంచి నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి శేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మూడువిడతలుగా ఆయా గ్రామాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

చెక్ డ్యాం పూడ్చినవారిపై చర్యలు తీసుకోండి

పుట్టపర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పశువులకు, రైతులకు ఉపయోగకరంగా ఉన్న చెక్‌డ్యాంను కొంత మంది స్వార్థపరులు పూడ్చివేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని వెంగలమ్మచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకటరాముడు, రైతులు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వెంగలమ్మచెరువు శ్మశాన వాటిక దగ్గరలో 20 ఏళ్లక్రితం చెక్‌డ్యాం నిర్మించారు. చెక్‌డ్యాం వల్ల వేసవిలో పశువులకు నీరు, శ్మశాన వాటికలో అవసరాలకు ఉపయోగపడడంతోపాటు చుట్టుపక్కల రైతుల బోర్లు రీచార్జ్ అయ్యేవి. కొందరు స్వార్థపరులు చెక్‌డ్యాంను పూడ్చివేసి భూమిలోకి కలిపేసుకుంటున్నారన్నారు. దీనిపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో చీమల నరసింహులు, చిన్నన్న స్వామి, జమప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇసుక అక్రమ రవాణాను అరికడతాం



చెక్‌పోస్టు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అగళి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అగళి మండలంలోని సువర్ణముఖినది నుంచి కర్ణాటకకు అక్రమంగా ఇసుక తరలిపోకుండా అరికట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. అగళి మండలంలో శనివారం వారు పర్యటించి నందరాజనపల్లి, కదిరేపల్లి, గ్రామాలలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసేందుకు స్థలాలను పరిశీలించారు. సువర్ణ ముఖి నదిని పరిశీలించిన అనంతరం త్వరలోనే చెక్‌పోస్టును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమ ఇసుకను కర్ణాటకకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అగళి పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట తహసీల్దార్ సుబ్బారావు, సీఐ రాజకుమార్, ఎస్ఐ వీరేష్, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, వీఆర్ఓ నరసింహమూర్తి ఉన్నారు.

అంగన్‌వాడీ ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హిందూపురం అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో ఖాళీ అయిన కార్యకర్తలు, ఆయాల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ శాంతి ఓ ప్రకటనలో కోరారు. అర్హులైన వారు గ్రామ సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలన్నారు. హిందూపురం మండలం బాలంపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును ఓసీకి, ధర్మపురం 2 లో ఆయా పోస్టును ఓసీకి, శాంతి నగర్-2లో ఆయా పోస్టు ఓసికి, మోడల్ కాలనీ -2లో ఆయా పోస్టు ఓసికి, మోడల్ కాలనీ-4లో హియరింగ్ హ్యాండీ క్యాప్‌డ్‌కు, అంబేద్కర్ నగర్-2లో ఎస్సీకి, చాకలికుంట ఓసికి, కె. నరసాపురం బీసీ-డి వారికి, లేపాక్షి మండలం చోళసముద్రంలో ఆయా పోస్టును విజువల్లీ హ్యాండీ క్యాప్‌డ్‌కు, చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి-1లో బీసీ-ఏకు, దేమకేతేపల్లి-2లో ఎస్సీకి హుసేనాపురం-1లో ఓహెచ్‌కు, యగ్నిసెట్టిపల్లిలో ఎస్సీకి కేటాయించామన్నారు. అర్హులైన వారు వివరాలకు 9440814480ను సంప్రదించాలన్నారు.

ఘనంగా వైకుంఠ ద్వాదశి వేడుకలు



పురవీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీ వెంకటరమణస్వామి

పెనుకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అతి పురాతనమైన లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయంలో వైకుంఠ ద్వాదశి వేడుకలను శనివారం నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభి షేకాలు, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రగతి శ్రీనివాసులు, యాడికి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భక్త కనకదాస రథోత్సవం

పరిగి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం కలశాలతో కనకదాసస్వామి ఊరేగింపు నిర్వహించి రాత్రి 8గంటలకు రథోత్సవ కార్యక్రమాన్ని చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి, ఏపీసీసీ సభ్యులు కేటీ శ్రీధర్ తదితర ప్రముఖ నాయకులు హాజరు కానున్నారు.

రేపు ముగ్గుల పోటీ

పెనుకొండ టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నట్లు త్రివేంద్ర నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక అన్నా క్యాంటీన్‌లో టీడీపీ శ్రేణులు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్‌కళాశాల మైదానంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.5వేలు, మూడో బహుమతిగా రూ.3వేలు అందించనున్నట్లు తెలిపారు.

గోకులం షెడ్లు సద్వినియోగం చేసుకోండి



గోకులం షెడ్డులోకి ఆవును తీసుకెళుతున్న గుండుమల

మడకశిర రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు గోకులం షెడ్డులను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని వై బి హళ్ళి పంచాయితీ తో ఒక్కొక్కటి రూ.2.30 లక్షలతో మూడు గోకులం షెడ్లు నిర్మించారు. వాటిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి శనివారం ప్రాంరభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీటవేస్తున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కొనప్పపాళ్యంలో పాడి రైతు శ్రీనివాసులు ఆవును గోకులం షెడ్డులోకి తీసుకెళ్ళి దానిని ప్రారం భించారు.

అమరాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో రైతులకు 80 శాతం సబ్సిడీతో గోకులం షెడ్లను మంజూరు చేశారు. శనివారం మండలంలోని నిద్రఘట్ట, చిట్నడుకు, హలుకూరు, గ్రామాల్లో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొని గోకులం షెడ్లను ప్రారంభించారు.

మధుగిరి డీవైఎస్‌పీగా మంజునాథ్

పావగడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : మదుగిరి ప్రాంతం డీవైఎస్‌పీగా మంజునాథ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. బెంగళూరు ఐజీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మంజునాథ్ మధుగిరి డీవైఎస్‌పీగా నియమించినట్లు ఎస్పీ అశోక్‌కు ఆదేశాలు జారీచేశారు. ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రమాదకర స్థితిలో బూదిలి వంతెన

● వంతెనపై సిమెంటు పైపునకు పెద్ద రంధ్రం
●ఏదైనా వాహనం ఇరుక్కుంటే
భారీ ప్రమాదం జరిగే అవకాశం



బూదిలి వంతెనపై మధ్యలో ఏర్పడిన రంధ్రం

గోరంట్ల, జనవరి1(ఆంధ్రజ్యోతి):మండలంలోని బూదిలి వద్ద చిత్రావతి నదిపై నిర్మించిన వంతెన దెబ్బతినడంతో ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. కదిరి రహదారినుంచి రెడ్డిచెరువు కట్టమీదుగా పాలసముద్రం జాతీయ రహదారి వైపు నిరంతరం ఈ వంతెనపై నుంచి భారీ వాహనాలు వెళుతుంటాయి. కొన్నేళ్ల క్రితం చిత్రావతి ఉధృతంగా ప్రవహించడంతో వంతెన కొట్టుకుపోయింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం సిమెంటు పైపులు ఏర్పాటు చేసి, మట్టి వేయడం ద్వారా తాత్కాలికంగా వంతెన నిర్మించింది. మరోసారి చిత్రావతి ప్రవహించడంతో రెండవసారి కొట్టుకుపోయిన వంతెనకు మరలా తాత్కాలికంగా మరమ్మతుచేశారు. అయితే వంతెన నిర్మాణ పనులు సరిగా చేయకపోవడంతో ప్రస్తుతం వంతెనపై ఏర్పాటు చేసిన సిమెంటు పైపుకు పెద్ద రంధ్రం ఏర్పడింది. ఈ కారణంగా ద్విచక్రవాహనాలు, భారీ వాహనాలు రంధ్రంలోపడి ప్రమాదం సంభవించే అవకాశముంది. దీంతో సమీప గ్రామాల వారు ఆందోళన చెందుతున్నారు. వెంటనే రంధ్రాన్ని పూడ్చి వంతెన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థులతో అధ్యాపకుల గ్రూప్ ఫొటో

పెనుకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో 2011-14 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఒకేచోట కలిసి మనసు విప్పి మాట్లాడుకున్నారు. స్థానిక కళాశాలలో ఏఓ కేశవయ్య ఆధ్వర్యంలో శనివారం తమకు చదువు చెప్పిన గురువులను ప్రస్తుతం పనిచేస్తున్న వారిని సత్కరించారు. సాయంత్రం వరకు విందు వినోదాలతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవి, మహేష్, కుల్లాయరెడ్డి, నరేంద్ర, రఫీక్, ప్రకాశ్, రవళి తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడా! జోహార్

● హిందూపురం, మడకశిర, పెనుకొండల్లో వడ్డె ఓబన్నకు ఘన నివాళి





జయంతిలో పాల్గొన్న నాయకులు



పెనుకొండలో..



గోరంట్లలో..



చిలమత్తూరులో..



అగళిలో..

బ్రిటీష్ వారిని ఎదిరించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుడు వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా శనివారం పలువురు ఆయనకు నివాళులర్పించారు. హిందూపురం పట్టణ పరిధిలోని శ్రీకంఠపురం వడ్డె ఓబన్న విగ్రహం వద్ద జరిగిన జయంతి వేడుకలకు కూటమి నాయకులు, వడ్డెర కులస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రభుత్వం ఓబన్న జయంతిని జనవరి 11న అధికారికంగా ప్రకటించడం ఆనందదాయకమని వడ్డెర్లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓబన్న బ్రిటీష్ సైన్యాన్ని మూడు చెరువుల నీరు తాగించిన పోరాట యోధుడన్నారు. దేశం గర్వించదగ్గ వీరుల్లో ఆయన ఒకరని, ప్రజల మానప్రాణాలు కాపాడటానికి ఆయన ఎప్పుడు ముందుండే వాడని, పల్లెల్లో నేటికి ఆయన చరిత్రను కథలు కథలుగా చెప్పుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఓబన్న విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అలాగే పెనుకొండ, మడకశిర, అగళి, చిలమత్తూరు, గోరంట్ల, సోమందేపల్లి తదితర చోట్ల ఆయనకు పెద్దఎత్తున నివాళులర్పించారు.



సీఎంను కలిసిన వడ్డెర నేతలు

పెనుకొండ, జనవరి11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్నజయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతోపాటు విజయవాడలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఓబన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి సత్యసాయిజిల్లా వడ్డెరసంఘం అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, వీజీపాళ్యం శ్రీనివాసులు, వేమయ్య, తదితరులు హాజరయ్యారు. అనంతరం ముఖ్యమంత్రిని కలిసి ఆయనకు ఓబన్న చిత్రపటాన్ని బహూకరించారు.

పారిశుధ్య కార్మికులను పట్టించుకోరా?



నిరసన వ్యక్తం చేస్తున్న మునిసిపల్ కార్మికులు

హిందూపురం అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తమ ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా ప్రజలకు సేవలు చేస్తున్న మునిసిపల్ పారిశుధ్య కార్మికుల బాగోగులను పట్టించుకోరా? అని సీఐటీయూ నాయకులు జెడ్పీ శ్రీనివాసులు, రాములు ప్రశ్నించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద రెండు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులకు మద్దతుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం బాగుండాలంటే పరిసర ప్రాంతాలు బాగుండాలని, పారిశుధ్య కార్మికులు పగలు రాత్రి పని చేస్తే కానీ సమాజం ఆరోగ్యకరంగా ఉండదన్నారు. సమాజంలో పారిశుధ్య కార్మికులే రియల్ హీరోలని అలాంటి కార్మికుల బాగోగులు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉందని అయితే ఈ ప్రభుత్వం కూడా వారిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన జ్వాలలు వెలువడుతున్నాయన్నారు. రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. కార్మికులు విధులు నిర్వహిస్తూ సాధారణ మరణం పొందితే రూ.2 లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.7లక్షలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు.

చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియతో పాటు ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పనిముట్లు, ఆయిల్, సోపు, గ్లౌజులు, బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షుడు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, ఉపాధ్యక్షుడు రామచంద్ర, కమిటీ సభ్యులు కవితమ్మ, గంగరత్న ఓబులమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని మునిసిపల్ కార్మికులకు యోగినారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

సోమందేపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై శనివారం సీఐ రాఘవన్ ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని మారుతినగర్‌లో సైబర్ నేరగాళ్లు ఎలా వల పన్నుతారో ప్రజలకు వివరించారు. వాట్సప్ ద్వారా ఇతర సోషల్ మీడియా యాప్‌ల ద్వారా వచ్చే లింక్‌లను క్లిక్ చేయరాదన్నారు. అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోరాదన్నారు. అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌ను తిరస్కరించాలన్నారు. వారు ఆడియో, వీడియో కాల్స్ ద్వారా ప్రలోభాలకు గురిచేస్తారని వారి మాయలోపడి మోసపోకూడదని హెచ్చరించారు. అదేవిధంగా డీఎస్పీ, సీఐ, ఎస్ఐ పేరిట వివిధ కేసులు నమోదయ్యాయి. మీరు స్టేషన్‌కు రావాలంటూ ఎవరైనా ఫోన్‌చేస్తే భయపడరాదన్నారు. అలాంటి వాటిపై 100కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే యువకులకు ద్విచక్రవాహనాలు కొనిచ్చే తల్లిదండ్రులు హెల్మెట్‌లు సైతం అందించాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తీరని నష్టం వాటిల్లుతుందనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, సిబ్బందిపాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మడకశిర రూరల్, జనవరి 11(ఆంధ్ర జ్యోతి) మండలంలోని ఉగ్రేపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం 11 కేవీ విద్యుత్ తీగలు తెగి కింద పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ప్రజలు ఎవ్వరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆప్రాంతంలో ఉన్న రైతులు దీనిని గమనించి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి వెళ్ళి క్రిందపడ్డ విద్యుత్ వైర్లకు మరమ్మతు చేశారు. గతంలో ఆశాఖ వారికి సమాచారం అందించినా పట్టిం చుకోలేదని వాపోయారు. వాటి స్థానంలో కొత్త వైర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అల్లుడి వాహనం ఢీకొని మామ మృతి



మృతి చెందిన మామ చిత్తప్ప

రొళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రొళ్లమండలం చిగమతిగట్ట గ్రామానికి చెందిన చిత్తప్ప(54) ద్విచక్ర వాహనం ఢీకొని శనివారం మృతి చెందాడు. చిగమతిగట్ట గ్రామంలో పొలం పనులు ముగించుకొని రోడ్డు మార్గంలో వస్తున్న మామ చిత్తప్పను ఎదురుగా వస్తున్న బంద్రేపల్లి గ్రామానికి చెందిన అల్లుడు మహేష్ తన వాహనంతో ఢీకొట్టాడు. దీంతో ఆయన కిందపడ్డాడు. చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణప్రసాద్ తెలిపారు.

జూదరుల బైండోవర్

సోమందేపల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని రూకలపల్లివద్ద జూదమాడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసి శనివారం ఎస్ఐ రమేష్ వారిని బైండోవర్‌చేసి తీవ్రంగా మందలించారు. ఇకపై జూదమాడుతూ కనిపిస్తే జైల్లో వేస్తామంటూ హెచ్చరించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు



గాయపడ్డ నవీన్‌కుమార్, తౌసిఫ్

పెనుకొండ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీ కొన్న ప్రమాదంలో ఇరువాహన దారులకు తీవ్రగాయాలయ్యాయి. శ్రీరాములయ్య కాలనీకి చెందిన తౌసిఫ్, నవీన్‌కుమార్ ద్విచక్రవాహనాల్లో ఎదురెదురుగా వస్తుండగా, పోలీస్‌స్టేషన్ వద్ద అదుపుతప్పి ఒకరినొకరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన వారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నవనిర్మాణ క్రికెట్ టోర్నమెంట్

అమరాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలంలోని మద్దనకుంట గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొనే జట్లు వివరాలకు క్రికెట్ మేనేజ్‌మెంట్ రంగారెడ్డిని సంప్రదించాలని తెలిపారు. రూ.800 ముందుగా చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెనుకొండ రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుట్టూరు వైజంక్షన్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఒకదానికొకటి మూడు వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలకు గురయ్యారు. బెంగ ళూరుకు చెందిన నందిని, రవి, విశ్వనాథ్‌లు హైదరాబాద్ నుంచి కారులో బెంగళూరుకు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో గుట్టూరు వైజంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయగానే వెనుకే వస్తున్న బస్సు, దాని వెనుక వస్తున్న ఐచర్‌వాహనం ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన పెనుకొండ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కియా పోలీసులు తెలిపారు. మూడు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

ప్రతి మహిళ సావిత్రీబాయి పూలేలా మారాలి

పావగడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): దేశానికి తొలి మహిళా గురువుగా పేరుగాంచి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన సావిత్రీ బాయాపూలే జీవితం వెలుగు చూడాల్సిన అవసరం ఉందని ప్రముఖ కన్నడ చలనచిత్ర నటి వినయప్రసాద్ తెలిపారు. శనివారం ఎస్ఎస్‌కె మందిరంలో నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయుల, సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్, ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి వెలిగించి మాట్లాడారు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ వర్గీయుల దాడి



చికిత్స పొందుతున్న హిదాయత్

హిందూపురం అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీ విభాగం నాయకుడు ఎండీఎస్ హిదాయత్‌పై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. స్థలం వివాదం నేపథ్యంలో శనివారం కత్తితో పొడిచారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాల్మీకి సర్కిల్‌లో ఉన్న స్థలం విషయంలో గడ్డ మీద ప్రాంతానికి చెందిన ఫయాజ్, సుహేల్, వసీం, షాజహాన్ తదితరులతో తమకు వివాదం ఉందని బాధితుడు తెలిపారు. కోర్టు తమకు అనుకూలంగా ఆదేశాలు ఇచ్చినా, స్థలాన్ని వారు కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తన తండ్రి ప్యారూసాబ్‌ను వేధిస్తున్నారని, దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు శనివారం వెళ్లాలని హిదాయత్ తెలిపారు. సీఐ లేకపోవడంతో ఇందిరా నగర్‌లోని తన వాటర్ ప్లాంట్ వద్దకు వచ్చానని, అక్కడ తనపై మూకుమ్మడిగా దాడి చేశారని తెలిపారు. గాయపడ్డ బాధితుడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.